పీతని చూసి సముద్రం
వికటాట్టహాసం చేసింది :

ఈ వారపు
పెద్దగాధ

రా. సీ. ఆంజనేయశాస్త్రి

★

# .... అవును, అది వూరు ! వాళ్ళంతా మనుష్యులు ! !

మొదట్లో సుబ్బయ్య స్వంతభూమిలోనే వ్యవసాయం చేశాడు. కాని, భార్య కాన్పులకీ, పెద్దకూతురి పెళ్ళికీ, కొడుకు చదువుకీ, తను ఖాయిలాపడినప్పుడూ షావుకారిదగ్గిర తెచ్చిన అప్పుల కింద, ఆ చెక్క కాస్తా షావుకారికి భుక్తమైపోయేసరికి ఆయనదగ్గిరే, కవులికి తీసుకున్నాడు తన భూమినే. ఇంటిల్లిపాదీ చాకిరీ చేసినా కవులుగింజలే మళ్లేవి కావు. బకాయి ధాన్యం నాలుగేళ్లు దిగదేసరికి దానికింద సుబ్బయ్య యిల్లు కూడా తీసుకున్నాడు షావుకారు. అయినా ఆయన ఎంతో దయగలవాడు కనక తన దొడ్లోని గొడ్లపాకలో ఒకవేపు కాపురం వుండవచ్చునన్నాడు సుబ్బయ్యతో. పాలేరుగా వుంటే తనకేమీ అభ్యంతరం లేదనికూడా చెప్పాడు. కాని బతికి చెడిన మనిషవడంచేత సుబ్బయ్యకి మనసొప్పలేదు. అయినా, తప్పనూ లేదు...

రెండు నెలలనుంచీ తండ్రి డబ్బు పంపకపోతడంవల్ల విషయం ఏమిటో కనుక్కుపోదామని పట్నంనుంచి వచ్చిన సుబ్బయ్యకొడుకు మామూలుగా తమ యింటికెళ్ళి చూసేసరికి, మామిడితోరణాలు కట్టివున్నాయి. తమ్ముడూ చెల్లెలూ, షావుకారిగారి పిల్లలతో ఆడుకుంటున్నారు. నాన్న వసారా ఊడుస్తున్నాడు. అమ్మ మాత్రం ఎక్కడా కనిపించలేదు. షావుకారూ, ఆయన భార్యా యింట్లో హడావిడిగా తిరుగుతున్నారు పీటలూ అవీ సద్దుతూ...ఆ రోజే గృహప్రవేశం!!

"నాన్నా, ఏమిటిదంతా ?... నువ్వు ఊడుస్తున్నావేం ? అమ్మ ఏదీ ?" అని అడుగుతున్న పెద్దకొడుకుని చూసి ఉలిక్కిపడ్డాడు సుబ్బయ్య. "పని నన్నాసి, మర్యాదహారాలన్నీ వాడి కందుకు" అని యింతకాలం రంగడి చెవిని పడనియ్యలేదు తండ్రి. కాని యిప్పుడిక తప్పేదేముంది? చీపిరోమాల పెట్టి నలుగురిలో ఎందుకని- కొడుకుని వీధిలోకి తీసుకెళ్ళి, రెండుముక్కల్లో జరిగిందంతా చెప్పాడు. "షావుకారు ధర్మరాజు. కనకనే యింతనీడ చూపించాడు. లేకపోతే, చెట్టుకింద కాచుకు తాగాల్సొచ్చేది" అంటూను.

రంగడికి ఆవేశం వచ్చింది. "నాటి కులంవాళ్ళ మనల్ని పాటించకుండా యింతపని చేశాడా వాడు !" అంటూన్న కొడుకు దురుసుతనానికి సుబ్బయ్య కొంచెం కోప్పడి "ఇంతకీ మన కర్మం నాయినా, ఆయనగారు చేసిందేముందీ పాపం! ఇంటికి నడు... గేదూ వస్తా, కాస్తాగి నీళ్లతో దాలి బోలెడు. వాళ్ళ బంధువులు చాలామంది వస్తారట..." అని రెండోకొడుకుని కేకేసి, అన్నయ్యని యింటికి తీసుకెళ్లు బాబూ" అంటూ వెనక్కెళ్ళాడు వాడితో ఆడుకుంటున్న షావుకారిగారి యీ రెండోపిల్లకూడా వెంబడించింది వాళ్ళని

తండ్రి యింతకాలం యీ వ్యవహారం దాచిపెట్టినందుకు కోపం, చదువుకున్న సమాజంలో తిరిగినందువల్ల ఏర్పడిన అస్పష్టభావాలూ, షావుకారుమీద క్రోధం, తమ దుస్థితికి న్యూనతా, కర్తవ్యవిమూఢతా, తికమకగా ఆవరించుకున్నా, ఉక్కిరిబిక్కిరి చేస్తుండగా, తమ్ముడితో గొడ్లసావిడి చేరాడు రంగడు. పెద్దకొడుకుని చూడగానే తల్లి బావురుమంది. కళ్లనీళ్ల పర్యంతం

అయింది పాపం అతనికేని. సాహుకారుగారి గొడ్ల పాకలో "గృహప్రవేశం" అయినప్పటినుంచి ఆవిడ మంచం పట్టింది మనోవ్యాధితో.

"తట్టలో సంసారం, బుట్టలో కొచ్చింది నాయనా! ఏం తెక్కలో ఏం డొక్కలో నాకేం తెలుసు? మీ నాన్నకి, ఆయనగారు... ధర్మరాజు ఇట్లొంచి వెళ్లేనాకా నాతో చెవిటే ఒట్టు" "పాపం యివాళ కూర ఏమీ లేదు కామాలు.. పప్పుపులుసు మిగిలింది పోస్తానుండు" అని ఇంటి యజమానురాలు నాతో అంటుంటే నాకు శూలా పెట్టి పొడిచినట్టుంటోంది బాబూ... నేను బతకను..." అంటూ కళ్లు తుడుచుకుంటున్న తల్లిని ఓదార్చటాని కతని దగ్గరేమీ సామాగ్రి కనిపించలేదు.

"ఆ పిల్ల మటుకు పిల్ల ఎంత యిదిగా వుండేది. "అత్తయ్యా అత్తయ్యా" అంటూ మన యింటి కొచ్చినప్పుడు! ఇప్పుడు కన్ను తిప్పుకోనిస్తే ఒట్టు!" అంటూండగా సీత దొడ్డిగుమ్మంలో కొచ్చింది. పద్హేనేళ్లుంటాయి. పచ్చని పసిమి కాదు గాని, మెలిఛాయ, కొంచెం పొడగరి అవటంవల్ల బొద్దుగా వున్నట్లు కనపించకపోయినా పుష్టిగల శరీరం.

మొదట్లో సీతని రంగడికిద్దామనే వుండేది సాహుకారుగారికి కొంచెం దూరబంధుత్వంకూడా వుంది. కాని సాహుకారు పట్టిందల్లా బంగారమవటం మొదలెట్టినట్టుగానే, రంగడి తండ్రిపని క్రమంగా దిగజారిల్లి, ఆఖరికి ఆయనకింద పాలేరుగా చేరేటప్పటికి యిప్పుడా సంబంధం చేద్దామనే తలంపే లేకపోయింది. సీతకూడా యీ మార్పు కనిపెట్టి రంగడిమీద పాకబోతున్న ప్రేమలతల్ని తెంచి పారేసింది. తన దొడ్లోనే గొడ్లసావిట్లో చేరేటప్పటికి సీతకి మరీ లోకువై పోయింది. ఒకటి రెండు మాట్లు రంగడి తల్లిని "ఏమే, ఒసేయి" అనబోయేసరికి సీతతల్లే కోప్పడింది కూడాను. చిన్నప్పటి నుంచీ ఒకేవూళ్లో సమానస్థాయీగా పెరగటంవల్లా, చుట్టుపక్కలవాళ్లు "రంగడు సీత మొగుడు" అన్నప్పుడు చిరునవ్వు నవ్వి తలితండ్రులు తమ ఆమోదాన్ని తెలుపుతూండడంవల్లా సీతకీ రంగడికీ, సహజంగా వయస్సుతోపాటు కలిగే పరివర్తనలూ భావాలూ ఒకరినొకరిని మరింత సన్నిహితం చేశాయి. రంగడూ అమ్మాయి హృదయంలో చోటు చేసుకున్నా డనటానికి సందేహంలేదు. కాని యీ రెండు నెలల్లో జరిగిన మార్పులు, రంగ


# కుష్టు ★ బొల్లి

అన్ని రకముల కుష్ఠులకు, బొల్లి వ్యాధులకు, ఇతర చర్మవ్యాధులకు గ్యారంటీగా పనిచేయుచున్నవి.

## మా ఔషధ రాజములే!!

క్రొత్తగా అచ్చువేయబడిన మా తెలుగు పెద్ద కేటలాగులు, 10 భాషలలో ముద్రించియున్న కేటలాగులు, యోగ్యతాపత్రములు ఉచితము!

## రెడ్డి & కో., ★ H. O. గోపాలపురం

(రిజిస్టర్డ్)

(వయా) తణుకు, తూ. (గోదావరిజిల్లా)

బ్రాంచ్ ఆఫీసులు:

బెజవాడ ★ వాల్తేరు ★ కటక్ ★ సికిందరాబాదు
గాంధీనగరం R. S. బక్సిబజార్ 8560 కింగ్సువే

నెల్లూరు ★ ఫజిల్‌నగర్
కాపువీధి గోరక్‌పూర్

తీని ఆమె హృదయంలోనుంచి నిర్దాక్షిణ్యంగా తరిమేశాయి. ఆ అమ్మాయి ఎంతమాత్రం ప్రతిఘటించలేదు. పై పెచ్చు సంతోషించే వుండవచ్చు. ఇప్పుడు చుట్టుపక్కలవాళ్లెవరూ "సీత రంగడి పెళ్లాం అవుతుంది'' అనడంలేదు కూడాను. ఈ సంగతి పాపం రంగడికేమీ తెలీదు.

బడిగుమ్మంలో కొచ్చిన సీతకి, తనచెల్లెలు రంగడిచెయ్యి పట్టుకొని నాట్యం తొక్కుతూన్నట్టు ఎగురుతూండటం కనిపించింది. తరిమెయ్యబడిన ఆతని చిత్రం మాత్రకని చూసుకున్నసరికి కాస్త ధైర్యం తెచ్చుకుని మళ్లా ఆ అమ్మాయి హృదయంలో ప్రవేశించటానికి పోట్లాడుతోంది. బిగ్గరిగా పిలవటానికి ధైర్యంచాలక తన చెల్లెలికి "ఇలా రమ్మ''ని కంటిసైగ చేసేసరికి "నేను రాను పో..." అనేసింది. తల్లితో మాట్లాడుతున్న రంగడిని, లవండరు సబ్బు వాసన ఏదో జ్ఞాపకాలు తెస్తుండగా "నేను రాను పో..." అనే మాటలు వినబడి వెనక్కి చూశాడు. సీత నిర్లక్ష్యంగా పక్కకి తిరిగి వెళ్ళిపోతుంటే, తాను కిందటిమాటు వచ్చినప్పుడు సీతకోసం లవండరుసబ్బుతోపాటు తెచ్చిన బంగారంగుల రిబ్బను జడలో కనిపించింది. తనకేదో అధికారం వున్నట్లనిపించి "సీతా యిలా రా" అన్నాడు రంగడు. సమాధానంగా ఆ అమ్మాయి, తపీమని దొడ్డితలుపు వేసి లోపలికెళ్ళిపోయింది. గుండెల్లో బాకుపెట్టి పొడిచినట్టు బాధపడి దూకుడుగా వీధివేపు కొచ్చాడు తల్లి వారిస్తున్నా వినకుండా రంగడు. ఇంట్లో ఎవరూ ప్రవేశించకుండా వీధితలుపు తాళంవేసి అప్పటికప్పుడే సీత గృహప్రవేశం అయి యింటికి పోవటానికి మెట్లు దిగుతోంది.

ఉద్రేకంగా అడిగాడు రంగడు "మా నాన్న చేసిన ఘోరం చూశావా?'' అని. జవాబు చెప్పటమే న్యూనత అనిపించినట్టుంది ఆ అమ్మాయికి. తులపరించుకుపోతుంటే "సీతా యిష్టమే నన్న మాట!" అన్నాడు. "పిచ్చివెధవ!'' అనుకున్నట్టు విరుపునవ్వు ఒకటి నవ్వి ముందుకి సాగిపోయింది. అంత నిరాదరణని భరించడం రంగడికి చేతకాదు. కొంచెం బిగ్గరిగా "నుంచో సీతా మరి నన్ను నువ్వు పెళ్లి'' ఆర్లోకిలోనే పురుగుని చూసినట్టు చూసి "ఛీ సిగ్గులేదూ'' అంటూ రెండంగల్లో తండ్రిదగ్గిర కెళ్లి "పాలేరుకొడుకు నన్ను నడిబజారులో పట్టుకుని నానాకూతలూ కూశాడు" అని ఏడ్చింది సీత. విన్నవాళ్లు నలుగురూ రంగడికే తప్పన్నారు "పాలేరు కొడుకు" అనేసరికి రంగడికి ఒళ్లు తెలీలేదు. అడ్డమైన తిట్లూ తిట్టాడు షావుకార్ని. సీతని నానాదుర్భాషలూ ఆడాడు. పదిమంది జతై రంగణ్ని నాలుగు ఉతికారు. తండ్రి మంచితనంవల్ల ప్రాణాలతో విడిచిపెట్టారు. తప్పితే, నిలువునా పాతేసి వుందురు! ఊళ్లో పెద్దషావుకారుని, దొంగరాక్షసి, ఘోరకి గాడూ, కంపలు మూర్ఖ గాడిదీ అని తిడుతాడా, ఓ పాలేరు వెధవ! పైగా నడివీధిలో పట్టుకుని, పెళ్లీడు పిల్లని పలకరిస్తాడూ!! నయం బతికి పోయాడు, సంతోషించండి, ఇదేం ఊరనుకున్నాడా, అతివనుకున్నాడా!" అంటూ అంతా వ్యాఖ్యానం చేశారు. అవును అది ఊరు! వాళ్లంతా మనుష్యులు!!

౨

"రంగారావను కాలేజీ విద్యార్థి ఎలక్ట్రిక్ ట్రెయిను ఎక్కుతుండగా, ప్రమాదవశమున క్రింద పడి మరణించెను" అన్న వార్త పేపర్లో చూసి ఆ మరణించిన యువకుడు రంగడేనని గ్రామస్థులు తెలుసుకున్నారు. "అవును. కండకావరం ఊరికే పోతుందా? ఎంత కలికాలమైనా భగవంతుడు అప్పుడప్పుడు చెప్పుదెబ్బ కొట్టినట్టు, పాపానికి ఫలం వెంటనే అనుభవింపచేస్తున్నే వుంటాడు... లేకపోతే ప్రపంచంలో వీళ్లకి పట్టపగ్గా లుంటాయా?" అని బాగా చదువుకున్న వేదాంతులు వ్యాఖ్యానం చేశారు రంగడి మరణవార్తమీద...

భార్య వద్దన్నా వినకుండా షావుకారుగారు, సుబ్బయ్య కుటుంబాన్ని దొడ్లోంచి వెళ్ళగొట్టినా, రంగడి దినవారాలికి, పాపం సాయంచేశాడు పుణ్యాత్ముడు. అన్నీ అయిపోయింతర్వాత, ఆ వూళ్లో కూలినాలి చేసుకుని బతకటం తలకొట్టినట్టయి, సుబ్బయ్య భార్యనీ, పిల్లలిద్దర్నీ తీసుకుని చెన్నపట్నం వచ్చేశాడు. ఆమెకి ఏడోనెల అని షావుకారు భార్యకి తెలిసి, చాటుగా ఓ పాతిక రూపాయలు చేతులో పెట్టబోగా. "పొలం బుట్రా. యిల్లూ వాకిలీ వేసుకుని, నా కొడుకుని పొట్టనబెట్టుకుని, ఊళ్లోంచి వెళ్ళగొట్టినప్పుడు, ఈ పాతికాపరకా మమ్మల్ని రక్షించవు" అంటూ తిరస్కరించింది సుబ్బయ్య భార్య!

---

శ్రీ ఆవంటి వాణి

పట్నంలో ఫాక్టరీకూలీగా చేర్చాడు భార్యని. మనోవ్యాధి, పుత్రశోకం, ఓపలేనిదయ్యె. పెగా.. ఒంట్లో ప్రాణమే లేదు...పస్తెం చేస్తుంది ? ఎని మిదో నెలలోనే పురుడొచ్చింది. చిన్నప్రాణం బైటపడిందో లేదో, పెద్దప్రాణం ఎగిరిపోయింది కొడుకులో కలుసుకుంటానికి !!...

పిచ్చెక్కిందనటానికి వీలులేదు కాని, చూస్తే అలాగే కనిపిస్తాడు సుబ్బయ్య. ఓ మహారాజు రిక్షా అద్దెకిచ్చాడు, జీవనం చెయ్యటానికి, అసలు ఆయన దొడ్లోనే యింత కాచుకు తాగమందాం అనుకున్నాడట కాని "రోజులు బాగుండలేదు. ఏ నాటికేం దొంగబుద్ధి పుడుతుందో, పిల్లలు గల వాడయ్యె...కైదూగీదూ పడితే కష్టమన్ని, ఆ రిక్షా యజమాని అటువంటి అవకాశం యివ్వలేదు.

పట్నంలో మంచి విశాలమైన రోడ్లకి రెండు పక్కలా మనుష్యులు నడవటానికి సిమెంటు చేసిన దార్లు చక్కగా అద్దమల్లే వుంటాయి. సుబ్బయ్య, దానిమీద కాపరం పెట్టాడు పిల్లలు ముగ్గురితోనూ... తక్కిన రిక్షావాళ్ళు ఏదో బాగానే సంపాదించుకుంటున్నారు కాని సుబ్బయ్యకు మాత్రం, రిక్షా అద్దెమళ్ళటమే కష్టంగా వుంది. ఓ సొరటోపి, మిలిటరీ నిక్కరూ, పొరబూట్సులూ సంపాదించాడు. ఎప్పుడూ ఎదో ఆలోచిస్తున్నట్టుగా రిక్షాముందు కూర్చుంటాడు. ఎవరన్నా పిలిస్తే వెళతాడు. లేకపోతే లేదు మధ్యాహ్నంపూట భోజనానికిగాను, ఆఫీసుల్లో పనిచేసేవాళ్ళూ, బళ్లో చదువుకునేవాళ్లూ, అన్నాలు తెప్పించుకుంటారు నౌకర్ల చేత టిఫిన్ క్యారియర్లలో, వాటిల్లో మిగిలిన ఎంగిలిమెతుకులు కలిపి ఆ నౌకర్లు అణాకి ఒక ముద్ద చొప్పున పెడుతారు కూలీలకీ, రిక్షావాళ్ళకీ. రిక్షా అద్దెపోను మిగిలిన డబ్బులతో రోజూ ఆ విందారగిస్తాడు సుబ్బయ్య. పెద్దపిల్లలకేం గాని, బస్సులాగేచోట, అడుక్కొని బతుకుతున్నారు... ఆ పసిగుడ్డే పదిరోజులపాటు బతికి ప్రాణంతీసింది పాపం. తినుకి పోటీగా ముష్టెత్తుకుంటానికి వచ్చిన ఆ గుడ్డిపిల్లకీ, ఆ కుంటికుర్రాడికీ ఎక్కువ డబ్బు ●● ర వటంవల్ల సుబ్బయ్య పిల్లలికి అప్పుడప్పుడనిపిస్తూవుంటుంది "మనకికూడా, కళ్లూ, కాళ్లూ లేకపోతే హాయిగా ఎక్కువ డబ్బు లొచ్చేవి గదా" అని. ఆడపిల్లని చూసిన పెద్దలూ ధార్మికులూ "పాపం ! మంచి పుటక గలదల్లె వుంది రోజులలా వచ్చాయి కామాలు...ఏదో కాస్త వయస్సొచ్చిందంటే, చక్కగానే సంపాదించుకు బతుకుతుంది..." అని తృప్తిని వెల్లడిస్తారు.

... ... ...

సీతా, సీతమొగుడూ ఒకమాటు పట్నంవచ్చి, బస్సు ఎక్కబోతుంటే "అమ్మగారూ ! ఒక్క కానీ దయచేయించండమ్మా !" అంటూ యీ పిల్లలు కనిపించారు. సీతకళ్లలో గిర్రున నీళ్లు తిరిగాయి. ఈ మధ్యే పెళ్లయింది. అప్పుడు గృహ ప్రవేశం అయిన యింట్లోనే విడిది పనులూ, కుంకుమ కింద సుబ్బయ్యదగ్గిర కట్టుకున్న పొలమూ, యిల్లూ సీతకిచ్చాడు తండ్రి.

"ఒదినా !" అని పిలవబోతున్న ఆ కుర్రవాడి గొంతును, సీతమెళ్ళో ధగధగా మెరిసే చంద్రహారం నొక్కేసింది. ఆ పిల్లల్ని కావిలించుకోటానికి ఉత్సాహిస్తున్న సీతచేతులికి, ఆమెభర్త "స్టైతస్కోపు" సంకెళ్ళు వేసింది.

ముష్టిపిల్లల చేతులో, సీత ఒకరూపాయి పెట్టింది. చూసినవాళ్ళకి ఆశ్చర్యంగానే వుంది రూపాయి యివ్వడం.

సాయంత్రం బీచికి రిక్షాలో పోతూ, మాటవరసకి సీతభర్త రిక్షావాడిని "మీదేవూరు ?" అని అడిగేసరికి, "ఫలానా !" అని చెప్పాడు. సీత ఉలిక్కిపడి "ఆపు ! ఆపు !!" అంది. అప్పుడే వెలిగిన విద్యుద్దీపపుకాంతిలో ఆమె సుబ్బయ్యని గుర్తుపట్టింది. తెల్లబోయిచూస్తూన్న సుబ్బయ్య మాత్రం సీతని సరిగా గుర్తుపట్టినట్టు లేదు.

"ఇహ నడిచి వెడదాం" అంటూ భర్త చెయ్యి పట్టుకుని రిక్షావాడికో రూపాయి గిరాటు వేసి, యిసకలో నడిచిపోతున్న సీతని చూసి సముద్రం వికటాట్టహాసం చేసింది.

"ఏమిటా గాభరా ?" అని అంటున్న సీత భర్త ప్రశ్న వినిపించదుంతాను.

ANANDAVANI is printed by V. AZIZULLA at Deccan Times Press Madras.
and published by V. KALIDAS, at 12 Thambu Chetty Street, Madras
Editor: V. KALIDAS, Associate Editors: Andra Seshagiri Rao B.A., Mudda Viswanadha